ములుగు పట్టణంలో చేపట్టిన విద్యుత్ మరమ్మతులు

మరమ్మతుల పేరుతో విద్యుత్ కోతలు

- వేగం అందుకోని పనులు
- నిత్యం విద్యుత్ అంతరాయం
- జిల్లా కేంద్రంలో ప్రజల ఇబ్బందులు

స్తంభంపై మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

ములుగు, మే 11(నమస్తేతెలంగాణ) : ములుగు జిల్లా కేంద్రంలో విద్యుత్ కోతలు రోజుల తరబడి కొనసాగుతున్నాయి. బండారుపల్లి రోడ్డు వైపు బీటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నూతన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఆ శాఖ ఏఈ ముందస్తు సమాచారం మేరకు ప్రతి రోజు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం, లేదా సాయంత్రం వరకు కోతలు విధిస్తున్నారు. దీంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఉక్క పోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పనుల్లో వేగం పెంచాల్సిన సదరు అధికారులు నత్త నడకన చేపడుతూ ప్రతి రోజు విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ప్రస్తుతం ములుగు జిల్లా కేంద్రంలో కొనసాగుతుంది. బండారుపల్లి రోడ్డుకు రెండు వైపుల ఉన్న కాలనీలతోపాటు జాతీయ రహదారి, రామాలయం రోడ్డు, గడిగడ్డ, సఫాయివాడ, కృష్ణకాలనీలతోపాటు కలెక్టరేట్ కార్యాలయ రోడ్డు వైపుల వైపు ఉన్న విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గత నెల రోజులకు పైగా నిరంతర విద్యుత్ సరఫరాకు ఆ శాఖ అధికారులు పనులను చేపడుతున్నారు. పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ మ్యాన్ పవర్ పెంచకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో మరమ్మతుల పేర నిరంతరం విద్యుత్ కోతలు విధిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, విద్యుత్ శాఖ అధికారుల పట్టింపు లేని ధోరణితో ఇంకా ఎంత కాలం విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

లక్ష్మీనర్సింహారావుకు స్వాగతం పలుకుతున్న గుడి పూజారులు

లక్ష్మీదేవర ఆశీస్సులు అందరిపై ఉండాలి

కన్నాయిగూడెం, మే 11 : జిల్లా ప్రజలు లక్ష్మీదేవర ఆశీస్సులతో బాగుండాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు అన్నారు. ఆదివారం మండలంలోని బుట్టాయిగూడెంలో జరుగుతున్న లక్ష్మీదేవర ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గుడి పూజారులు ఆయనను ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పలు శుభ కార్యక్రమాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సుబ్బుల సమ్మయ్య, గడదాసు సునిల్‌కుమార్, సీనియర్ నాయకులు కావిరి చిన్నికృష్ణ, వెంకటయ్య, ఖాజా పాషా, యూత్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

వైన్‌షాప్ సమయపాలన పాటించాలి

కన్నాయిగూడెం, మే 11 : మండలంలోని భవాని వైన్‌షాప్ సమయపాలన పాటించాలని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడెం బాబు, మండల అధ్యక్షుడు గుండ్ల పాపారావు వైన్‌షాప్ వద్దకు చేరుకుని చూడగా వైన్‌షాప్ మూసి ఉంది. మధ్యాహ్నం 12గంటలకు తెరిచి సాయత్రం 5గంటలకే బంద్ చేస్తున్నారని, బెల్ట్ షాపులో కొనుగోలు చేయడంతో ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ.30నుంచి40 ఎక్కువగా చెల్లించి మందుబాబులు నష్టపోతున్నారని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు వైన్‌షాప్ సమయపాలన పాటించేవిధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, మల్లయ్య, ముత్తయ్య, మల్లికార్జున్, భాస్కర్, దుర్గయ్య, మధుకర్, బక్కయ్య ఉన్నారు.

సరస్వతీ పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కాళేశ్వరంలో అసంపూర్తిగా ఉన్న పనులపై ఆగ్రహం

పనుల పురోగతిని మంత్రి శ్రీధర్‌బాబుకు వివరిస్తున్న కలెక్టర్

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 11 : ఈ నెల 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాల పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హెచ్చరించారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని వీఐపీ ఘాట్, సరస్వతీ మాతా విగ్రహం, జ్ఞానతీర్థం, టెంట్ సిటీ తదితర ప్రదేశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి రాక సందర్భంగా బందోబస్తు, పనులు పూర్తి చేసే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులు చాలా ఆలస్యంగా జరుగుతున్నాయని, దీనికి అధికారులే జవాబు చెప్పాలన్నారు. పట్టణం మొత్తాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయాలని, 12 రోజులు పండుగ వాతావరణం కనబడాలని సూచించారు. పిండ ప్రదాన భవనం అసంపూర్తిగా ఉందని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు నదిలోకి స్నానాలకు వెళ్లడానికి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలన్నారు. 50 మంది గజ ఈతగాళ్లను, నాటు పడవలను అందుబాటులో ఉంచాలన్నారు. పుష్కరాల సందర్భంగా మొదటిసారిగా కాళేశ్వరంలో టెంట్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. హారతి కార్యక్రమం పర్యవేక్షణకు దేవాదాశాఖ ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవానికి వస్తున్నారని, అలాగే తదుపరి రోజుల్లో గవర్నర్, మంత్రులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, ఎక్కడా గుంతలు ఉండొద్దని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం ముఖ్యమని, పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండాలని, ప్రతి 30 నిమిషాలకు మరుగుదొడ్లు శుభ్రం చేసేలా పర్యవేక్షకులను నియమించాలన్నారు. ఒక్క నిమిషం కూడా కరెంటు పోవద్దని, ఆరు 125 కేవీ జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. భక్తులకు ప్రతి రోజు అన్నదానం చేయాలన్నారు. మెయిన్ ఘాట్ వద్ద ఆర్చి స్లాబు ఎందుకు వేశారని, భక్తులు నదిలోకి ఎలా వెళ్తారో చెప్పాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. రవాణా సౌకర్యానికి క్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఆయన వెంట దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకటరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ ఆర్జేసీ రామకృష్ణారావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఉన్నారు.

15న సీఎం రాక

ఈ నెల 15న సరస్వతీ పుష్కరాల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు అధికారులు తెలిపారు. వీఐపీ ఘాట్ వద్ద హెలీ ప్యాడ్‌ను సిద్ధం చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే బాంబు స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. కన్నెపల్లిలో మూడు, వీఐపీ ఘాట్ వద్ద ఒకటి మొత్తం నాలుగు హెలిప్యాడ్‌లను అధికారులు సిద్ధం చేశారు.

లారీల ఓవర్ స్పీడ్ తగ్గించాలి

భూపాలపల్లి రూరల్, మే 11 : లారీల ఓవర్ స్పీడ్‌తో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు కొండ్ర సాయి తేజ అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సాయితేజ మీడియాతో మాట్లాడారు. భూపాలపల్లి నుంచి హనుమకొండ వరకు లారీల ఓవర్‌లోడ్ వల్ల రోడ్లు గుంతలు పడ్డాయని తెలిపారు. ఓవర్ స్పీడ్ వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతూ మనుషులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి లారీల ఓవర్ లోడ్ తగ్గించాలని, రోడ్లు గుంతలు కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఓవర్ స్పీడ్ తగ్గేంచేందుకు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలని అన్నారు. ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీపీయూఎస్ఐ కరపత్రాల ఆవిష్కరణ

ములుగురూరల్, మే 11 : ములుగు జిల్లా కేంద్రంలోని శాంతి స్తూపం వద్ద ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ(సీపీయూఎస్ఐ) ఆధ్వర్యంలో మరోజు వీరన్న 26వ వర్ధంతి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అమరవీరుల సంతాప సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్, ఇతర నాయకులు ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మంగపేట, మే 11 : ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి మాత్రమే మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా నాయకుడు గుగ్గిల్ల సురేశ్‌మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో తగిన విచారణ జరిపాకనే ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. మండలంలోని 25పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల్లో ఉండటానికి నివాసం లేని కడు నిరుపేదలున్నారని, వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరారు. ఇండ్ల మంజూరు వ్యవహారంలో రాజకీయ పార్టీ నాయకుల జోక్యాలు లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. లంజపెల్లి సారయ్య, గుండేటి జంపయ్య, లంజపెల్లి చిన్న శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ములుగురూరల్, మే 11 : ములుగు మండలంలోని అంకన్నగూడెం, జగ్గన్నగూడెం, సర్వాపురం, కొత్తూరు, యాపలగడ్డ, పంచోత్కులపల్లి గ్రామాలకు చెందిన 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆదివారం సీపీఎం ఏజెన్సీ కమిటీ కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవో వజ్జ తిరుపతి హాజరై 20మంది విద్యార్థులను సన్మానించి అభినందించారు. విద్యార్థులు చదువులో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు వజ్జ రాజు, కొర్ర రాజు, తవిటి నారాయణ, నవీన్, గుండెమీది వెంకటేశ్వర్లు, సాంబయ్య, ఐశ్వర్య, లక్ష్మి, విజయ, పావణి, శ్రీలత పాల్గొన్నారు.

వధూవరులకు గండ్ర దంపతుల ఆశీర్వాదం

పల్లవి- ఉదీప్ రెడ్డి దంపతులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

కృష్ణకాలనీ, మే 11 : హనుమకొండ జిల్లాలోని మడికొండలో గల రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన భూపాలపల్లి మండల మాజీ ఎంపీపీ మండల లావణ్య-విద్యాసాగర్‌రెడ్డి దంపతుల కుమార్తె పల్లవి, మొగుళ్లపల్లి మండలం వేములపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బెల్లంకొండ మాధవి, శ్యామ్‌సుందర్‌రెడ్డి దంపతుల కుమారుడు ఉదీప్ రెడ్డిల వివాహ వేడుక జరిగింది. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి దంపతులు పాల్గొని వధూవరులకు పట్టు వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. అదేవిధంగా భూపాలపల్లి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులకు పట్టు వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్, రూరల్ అధ్యక్షులు కటకం జనార్దన్, పిన్‌రెడ్డి రాజిరెడ్డి, భూపాలపల్లి మాజీ ఎంపీపీ కళ్లెపు రఘుపతిరావు, మొగుళ్లపల్లి మాజీ జడ్పీటీసీ జోరుగా సదయ్య, చెల్పూరు గ్రామ మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మండల రవీందర్‌రెడ్డి, కాసర్ల దేవేందర్‌రెడ్డి, మెతుకు తిరుపతిరెడ్డి, చిన్నాల ప్రవీణ్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ పటేల్ పాల్గొన్నారు.

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా సమన్వయకర్త రమణారావు

భూపాలపల్లి రూరల్, మే 11 : ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న పాలిసెట్-2025 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిసెట్-2025 జిల్లా సమన్వయకర్త, భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రమణారావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 384 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 240మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 240మంది విద్యార్థులు, మొత్తం 864 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్ష సమయానికి గంట ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని తెలిపారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి ఎదుర్కోలు

స్వామి వారి ఎదుర్కోలు నిర్వహిస్తున్న సిబ్బంది

మంగపేట, మే 11 : మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగం గా ఆదివారం గర్భగుడిలో కొలువైన స్వామివారిని తిలతైలాభిషేకం చేసి వెండి నగలతో ప్రత్యేకంగా అలంకరించి పూజా క్రతువులు చేశారు. ప్రత్యేక పూజల నడుమ లక్ష్మీనర్సింహస్వామికి ఆదిలక్ష్మి-చెంచులక్ష్మి అమ్మవార్లతో ఘనంగా ఎదుర్కోలు మహోత్సవం, గరుడ వాహనసేవ జరిపారు. అనంతరం మేళ వాయిద్యాల నడుమ మల్లూరు గ్రామానికి తీసుకొచ్చి రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. మరోవైపు గుట్టపై స్వామివారికి రాత్రి మహానివేదన సమర్పించారు. వేడుకల్లో భద్రాచలం దేవస్థాన మురళీకృష్ణమాచార్యుల బృందం, స్థానిక అర్చకులు రాజశేఖరశర్మ బృందం, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా, స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన కారంపూడి రుక్మిణి, ఆమె కుమారుడు పవన్‌కుమార్ ఆచార్యులు, మనమడు, మనుమరాలు శ్రీనివాసవిరంచి, శ్రీసాంధ్రసిందులు 726 గ్రాములతో మూడు వెండి కిరీటాలు చేయించి అందించారు.

మేడారంలో భక్తుల సందడి

సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తాడ్వాయి, మే 11 : వనదేవతలు మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పక్క రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి తల్లుల గద్దెల వద్ద గిరిజన సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తల్లులకు యాటపోతులు, కోళ్లు సమర్పించి గద్దెల పరిసరాల్లో విడిది చేశారు. వంటలు చేసుకుని కుటుంబ, బంధు మిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అందజేత

కాటారం, మే 11 : మండలంలోని గుండ్రాత్‌పల్లికి చెందిన తిరుపతి, బొప్పారానికి చెందిన సమ్మయ్య, కొత్తపల్లికి చెందిన గుంటి సాయికిరణ్ ఇటీవల తమ సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. బాధితులు కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సై అభినవ్, ఎస్సై-2 శ్రీనివాస్, ట్రైనీ ఎస్సై గీతారాథోడ్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఆదివారం అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చిట్యాల, మే 11 : మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ అందజేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి సహకారం మేరకు రూ.1,13,500 విలువగల సీఎం సహాయనిధి చెక్కులను నలుగురికి ఆదవారం అందజేసినట్లు సాగర్ తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కట్టెకోళ్ల రాజు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, తిరుపతి, కుమార్, రాజు శివాజీ ఉన్నారు.

మల్లూరు గుట్టకు కాలినడకన హనుమాన్ భక్తులు

ఏటూరునాగారం, మే 11 : మండలంలోని రామాలయం నుంచి హనుమాన్ మాలధారణ భక్తులు మంగపేట మండలం మల్లూరులోని శ్రీలక్ష్మీ నర్సింహాస్వామి ఆలయానికి కాలినడకన ఆదివారం బయలుదేరారు. హనుమాన్ జెండాలను చేతబూని జై శ్రీరాం, జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ బయలు దేరారు. సోమవారం శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం జరుగనున్న నేపథ్యంలో హనుమాన్ భక్తులు మల్లూరు గుట్టపైకి ఆదివారం రాత్రి వరకు చేరుకోనున్నారు. అక్కడే బస చేసి సోమవారం కల్యాణం తిలకించి అక్కడ నుంచి తిరిగి ఏటూరునాగారం రానున్నారు. గురుస్వాములు నకిరబోయిన రమేశ్, గాడిచర్ల సాంబయ్య, మాచర్ల వెంకటేశ్వర్లు, లక్క మహేశ్, ఇర్సవడ్ల సంతోశ్, సిద్ధు, మండల నాగరాజుతోపాటు 30మంది వరకు కాలినడకన మల్లూరు గుట్టకు వెళ్లినవారిలో ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రేగొండ, మే 11 : భక్తులతో నిత్య పూజలు అందుకుంటున్న కొడవటంచ లక్ష్మీనరసింహ కల్యాణ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండలంలోని కొడవటంచ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షతం సందర్భంగా స్వామి వారి కల్యాణ వేడుకలు ఆలయ చైర్మన్ భిక్షపతి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా స్వామివారికి అభిషేకం, సుదర్శన, నారసింహహోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు ఈ కల్యాణ వేడుకలకు హాజరై స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈవో మహేశ్, సిబ్బంది, ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

భూపాలపల్లి రూరల్, మే 11 : నేడు (సోమవారం) కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాల విధుల నిర్వహణలో నిమగ్నమై ఉన్న నేపథ్యంలో ప్రజావాణిని రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు గ్రహించి ఫిర్యాదులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావొద్దని ఆయన సూచించారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ములుగురూరల్, మే 11 : స్కూల్ అసిస్టెంట్ గణితం, సోషల్, ప్రాథమిక పాఠశాల ఎమ్మార్సీలకు చల్వాయి మోడల్ పాఠశాలలో నేటి నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో పాణిని తెలిపారు. ఉదయం 9:30నుంచి సాయంత్రం 5:30గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 8977924554ను సంప్రదించాలన్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

మంగపేట, మే 11 : మండలంలోని వాగొడ్డుగూడెంకు చెందిన బుడుగుల పిచ్చయ్య(63) ఆదివారం వడదెబ్బతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం పిచ్చయ్య వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాడు. ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని ఓ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాటారం, మే 11 : కాటారం మండలం కొత్తపల్లి-ములుగుపల్లి గ్రామాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పంబాపూర్ గ్రామానికి చెందిన సురేశ్ ఆదివారం ద్విచక్ర వాహనంపై కొత్తపల్లి వైపుగా వస్తున్నాడు. ముందు వెళ్తున్న కారు రోడ్డుపై గుంతలు ఉండటంతో అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో కారు వేనకాల బైక్‌పై వస్తున్న సురేశ్ కారును ఢీకొట్టి కింద పడ్డాడు. తలకు గాయాలు కావడంతో స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

జామాయిల్ తోట దగ్ధం

మొగుళ్లపల్లి, మే 11 : మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటల చెలరేగాయి. గ్రామానికి చెందిన మంద తిరుపతిరెడ్డి జామాయిల్ తోట, మంద సంజీవ రెడ్డికి చెందిన వరి గడ్డికి మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.3లక్షల ఆస్థి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఆగని వన్యప్రాణుల వేట

మహాముత్తారం, మే 11 : దుప్పి మాంసంతో వేటగాళ్లు పోలీసులకు పట్టుబడిన ఘటన మహా ముత్తారం మండలం నిమ్మగూడెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే .. నిమ్మగూడెం గ్రామానికి చెందిన గావిడి సాయిరాం, గావిడి ఉదయ్‌కిరణ్, దుర్గం రాజశేఖర్ వరి పొలానికి విద్యుత్ వైర్లు అమర్చారు. అటుగా వచ్చిన దుప్పి అమర్చిన విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌తో మృతి చెందింది. దాని మాంసాన్ని భూపాలపల్లి మండలం నాగారంలో అమ్ముతున్నారనే సమాచారం మేరకు స్థానిక ఎస్సై మహేందర్‌కుమార్ సిబ్బందితో అక్కడికి వెళ్లి మాంసంతో వారిని పట్టుకున్నారు. ఫారెస్ట్ శాఖకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు పై ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం పూర్తి సమాచారం సోమవారం తెలుపుతామని పెగడపల్లి ఎఫ్ఆర్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు.

మురుగుగుంతలో నల్లాలు

ఇబ్బంది పడుతున్న ప్రజలు

వెంకటాపురం(నూగూరు), మే 11 : మండల పరిధిలోని వీఆర్కే పురం గ్రామంలో తాగునీటి నల్లా మురుగుగుంతల మధ్యలో ఉండటంతో ప్రజలు తాగునీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నల్లాల వద్ద పైప్‌లైన్ లీక్ కావడంతో నీరు కలుషితంగా మారుతుంది. అధికారులు స్పందించి నల్లాల వద్ద లీకేజీలను అరికట్టి తాగునీటి బ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు రోజులు సరఫరాకు అంతరాయం

కన్నాయిగూడెం, మే 11 : మండలంలోని అన్ని గ్రామాలకు నేడు, రేపు రెండురోజులు ఉదయం 5:30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటూరునాగారం నుంచి ఏటూర్, కన్నాయిగూడెం సబ్‌స్టేషన్‌కు సరఫరా చేసే 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, ఇన్సులేటర్లు మార్చడం వంటి పనులు నిమిత్తం జరుగుతున్న ఈ అంతరాయానికి ప్రజలు, రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

ములుగురూరల్, మే 11 : ములుగు జిల్లాలోని ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే ప్రయాణికులు సమస్యల పరిష్కారం నిమిత్తం నేడు(సోమవ